క్లుప్తంగా...

నేడు ఫ్రీడమ్ రన్

గోల్కొండ: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా మంగళవారం ఫ్రీడమ్ రన్ నిర్వహిస్తున్నామని తెలంగాణ ఫ్యామిలీ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు గోల్కొండ బంజారా దర్వాజ సమీపంలోని దక్కన్ పార్కులో ఈ ఫ్రీడమ్ రన్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో పాల్గొనదలచిన వారు 9908954163లో సంప్రదించాలన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



గోల్కొండ: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని నాయకులు ఆకుల గోవర్ధన్ అన్నారు. మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ హయాంలోనే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు సరైన గుర్తింపు వచ్చిందన్నారు.

సత్కారం



మీర్ మోహతేషామ్ అలీకి భారత్ కే అన్మోల్ అవార్డు అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: క్రీడా రంగంలో ఎన్నో విజయాలు సాధిస్తున్న మీర్ మోహతేషామ్ అలీకి భారత్ ఏ అన్మోల్ అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. ఎథోస్ ఇమాజినేషన్ వ్యవస్థాపకుడు వరప్రసాద్ ఈ అవార్డును అందజేసి ఘనంగా సత్కారం చేశారు. అబిడ్స్‌లో జరిగిన కార్యక్రమంలో మీర్ మోహతే షామ్ అలీ మాట్లాడుతూ.. బాడీబిల్డింగ్, ఫిట్‌నెస్ రంగంలో సంకల్పం, పట్టుదలతో పలు విజయాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖయ్యుమ్‌ఖాన్, అథర్ ఫారూఖీ, ఖలీ ఖుర్ రహ్మాన్, రమేష్ ఎప్పలపల్లి పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం



పోలీసు అధికారులను సన్మానిస్తున్న జూలూరు గౌరీశంకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: కేంద్ర హోంశాఖ ప్రకటించిన ఎక్సలెన్స్ అవార్డులకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన అడిషనల్ ఎస్పీ మేకల తిరుపతి, ఏసీపీ కేఎం.కిరణ్‌కుమార్‌ను సోమవారం రవీంద్రభారతిలోని సాహిత్య అకాడమి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ.. చిత్తశుద్ధితో విధులు నిర్వహించిన అధికారులకు అవార్డులు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమి కార్యదర్శి బాలాచారి పాల్గొన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు



అబిడ్స్: స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని ముందు జాగ్రత్త చర్యగా అబిడ్స్‌లోని పలు ప్రాంతాల్లో లాడ్జీలు, హోటళ్లలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అబిడ్స్ డివిజన్ ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు పలు లాడ్జింగ్‌లలో, హోటళ్లలో తనిఖీలు చేపట్టి అన్ని వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు మాట్లాడుతూ.. అనుమానాస్పద వస్తువులు కానీ, అనుమానాస్పద బ్యాగులు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పూర్తి వివరాలు తీసుకున్న తర్వాతనే లాడ్జీలు, హోటళ్ల రూమ్‌లు అద్దెకు ఇవ్వాలని వారు సూచించారు.

స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో స్వాతంత్య్ర వేడుకలు



గౌలిపురా: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను శాలిబండ బేలాలోని స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు నేతాజీ సుభాష్ చంద్రబోస్, దేశ రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న సైనికులు, ప్రజలకు సేవలు అందిస్తున్న పోలీసు, డాక్టర్ తదితర వేషధారణలలో సందడి చేశారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి



ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో..



ర్యాలీలో సీఆర్‌పీఎఫ్ గ్రూపు సెంటర్ డీజీపీ ఉదయ్ భాస్కర్ బిల్లు, కమాండెంట్ ఓంహరి



కోట వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం వేదికగా నిర్వహించిన 'ఏకమ్'కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన హర్ ఘర్ తిరంగా, మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమాల్లో సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు త్రివర్ణ పతాకంతో సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు. అనంతరం డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ జింగ్రాన్, సీజీఎం రాజేష్ కుమార్ సమక్షంలో 'పంచ్ ప్రాణ్'థీమ్‌తో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మంజు శర్మ, డిప్యూటీ జనరల్ మేనేజర్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ర్యాలీ..

చాంద్రాయణగుట్ట: ఆజాదీకా అమృత్ మహోత్సవం సందర్భంగా పాతబస్తీలోని గ్రూపు సెంటర్ సీఆర్‌పీఎఫ్ తరఫున సోమవారం ప్రతి ఇంటింటికీ జెండాలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీ స్టార్ట్ గ్రూపు సెంటర్ సీఆర్‌పీఎఫ్ చాంద్రాయణగుట్ట నుంచి బయలుదేరి చార్మినార్ వరకు చేరుకుంది. అక్కడ ప్రజలు, స్టూడెంట్స్, టూరిస్టులు, పారిశుద్ధ్య కార్మికులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ గ్రూపు సెంటర్ డీజీపీ ఉదయ్ బాస్కర్ బిల్లు, కమాండెంట్ ఓంహరి, డిప్యూటీ కమాండెంట్ అశ్విని మిశ్రా, అసిస్టెంట్ కమాండెంట్ ఎ.కె.పాండే, నాగరాజు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చౌరస్తాలో..శివకుమార్ యదవ్, లక్ష్మీనారాయణ

గోల్కొండ కోట వద్ద..

గోల్కొండ: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఉందని బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం మేరీ మటీ మేరా దేశ్ కార్యక్రమాన్ని గోల్కొండ కోట వద్ద ప్రారంభించారు. బీజేవైఎం కార్వాన్ అసెంబ్లీ కన్వీనర్ శ్రావంత్‌ముదిరాజ్, ఆకుల గోవర్ధన్, జి.శివరత్నం, రాధిక తదితరులున్నారు.

జియాగూడలో..

జియాగూడ: స్వాతంత్య్ర దినోత్సవం రోజు జాతీయ జెండాను ఎగురవేయాలని గోల్కొండ జిల్లా బీజేపీ డైయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్, జియాగూడ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకుని లక్ష్మీనరసింహనగర్, వెంకటేశ్‌నగర్, కుల్సుంపురా 2జే బస్టాండ్ తదితర ప్రాంతాల్లో జాతీయ జెండాలను పంచిపెట్టారు. బీజేపీ నాయకులు రమేష్ చౌగ్లే, రాజ్‌పోల్, భాస్కర్‌గుప్తా, మనీష్ జైన్, సంతోష్, రాకేష్, శివాజీ పాల్గొన్నారు.

మజ్లిస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



మజ్లిస్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి మిరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో టోలిచౌకి, గోల్కొండ డివిజన్‌లకు చెందిన మజ్లిస్ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా వారిని ప్రోత్సహించాలని ముఖ్యంగా నిరక్షరాస్యులకు సంక్షేమ పథకాల గురించి తెలియదని అటువంటి వారికి సంక్షేమ పథకాల విశేషాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు బదరుద్దీన్, ఆరూన్‌ఫరాన్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అన్ని పండగలకు ఆదరణ



వేడుకల్లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: బీఆర్ఎస్ హయాంలోనే అన్ని పండగలకు ఆదరణ లభించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు కాశిబుగ్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మైనంపల్లి మాట్లాడుతూ.. అన్ని పండగలను ప్రభుత్వమే స్వయంగా చేపడుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు విలువ పెరిగిందన్నారు. ఈ పూజా వేడుకల్లో బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, నాయకులు ఆనంద్ సింగ్, పప్పుమాత్రే తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం



చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల గ్రంథాలయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ రంగనాథన్ భారతదేశ గ్రంథాలయాలకు, గ్రంథాలయ శాస్త్రానికి చేసిన సేవలకు గుర్తుగా వారి జన్మదినాన్ని జాతీయ గ్రంథపాలకుల దినోత్సవంగా జరుపుకుంటారు. ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. రంగనాథన్ సేవలను కొనియాడుతూ గ్రంథాలయంలో ఉన్న అమూల్య పుస్తక సంపదను వినియోగించుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్ రత్న ప్రభాకర్, డాక్టర్ నీరజా, సీనియర్ ఏలూరు యాదయ్య, అవధానం సుజాత, కోయి కోటేశ్వర్‌రావు, ఆనంద్, ఝాన్సీ, అనిల్, అనంతలక్ష్మి, సుజాత, కేథరిన్, డా. సారయ్య దొర పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బహదూర్‌పురా: జూపార్కుల డైరెక్టర్‌గా సోమవారం వీఎస్ఎన్‌వీ ప్రసాద్ వినయ్‌కుమార్ వద్ద నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జూపార్కు క్యూరేటర్ ప్రశాంత్ బాజీరావు పాటిల్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి జూపార్కు నిర్వహణ వ్యవస్థ, దాని లక్ష్యాలను వివరించారు. డిప్యూటీ క్యూరేటర్ నాగమణి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎ.హకీం, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శంబులింగం, అసిస్టెంట్ క్యూరేటర్లు శ్రీదేవి, లక్ష్మణ్, ఎ.సతీష్ బాబు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య

డబీర్‌పురా: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య సూచించారు. దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం సంజరీ ఫంక్షన్ హాల్‌లో మెడికల్ షాపు నిర్వాహకులు, స్టేషనరీ దుకాణాల నిర్వాహకులతో 'నషా సే ఆజాదీ'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ సాయి చైతన్య మాట్లాడుతూ.. మెడికల్ షాపుల నిర్వాహకులు ప్రిస్క్రిప్షన్ లేకుండా ప్రజలకు ఎలాంటి మందులను ఇవ్వకూడదన్నారు. ఒక వేళ ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తూ కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

- ముస్తాబయిన పాతబస్తీ
- 300 మీటర్ల మువ్వన్నెల జెండాతో విద్యార్థుల ర్యాలీ, ప్రదర్శన

చార్మినార్: పంద్రాగస్టు వేడుకలకు పాతబస్తీ ముస్తాబయ్యింది. పాతబస్తీ లోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు విద్యా సంస్థలు వేడుకలకు సిద్ధమయ్యాయి. ఆయా బస్తీల్లోని యువజన సంఘాలు, బస్తీ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు, పోలీసు సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా తమ తమ బస్తీలు, కార్యాలయాల్లో మువ్వన్నెల పతాకాలతో అలంకరించారు.

300 మీటర్ల మువ్వన్నెల జెండాతో ప్రదర్శన..

మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం 300 మీటర్ల పొడవు గల మువ్వన్నెల జాతీయ పతాకంతో విద్యార్థులు ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. మదీనా సర్కిల్ వద్ద ఎంసీఎం మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మదీనా, పత్తర్‌గట్టి, గుల్జార్‌హౌజ్, చార్ కమాన్ మీదుగా చార్మినార్ వరకు కొనసాగిన ఈ ర్యాలీ తిరిగి మదీనా సర్కిల్‌కు చేరుకుంది.

పాతబస్తీలో గట్టి బందోబస్తు: డీసీపీ సాయి చైతన్య

పంద్రాగస్టు సందర్భంగా దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ఇప్పటికే బందోబస్తును సమీక్షించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా దక్షిణ మండలం పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాతబస్తీలోని కీలకమైన అన్ని ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగిస్తున్నారు. తనిఖీల సందర్భంగా బ్యాగులు, టిఫిన్ బాక్స్‌లు, వాహనాల డిక్కీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.



మహ్మద్ క్యాప్ మార్ట్ ఆధ్వర్యంలో 300 మీటర్ల మువ్వన్నెల జెండాతో ప్రదర్శన



చార్మినార్ వద్ద జాతీయ జెండాలతో సీఆర్‌పీఎఫ్ జవాన్లు, యువతీయువకులు

23న పురస్కారాల ప్రదానం

సుల్తాన్‌బజార్: 2023 సంవత్సరానికి తెలంగాణ సారస్వత పరిషత్ వివిధ ప్రక్రియల్లో కృషిచేస్తున్న వారికి ధర్మనిధి సాహిత్య పురస్కారాలను అందిస్తున్నట్లు తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్ష కార్యదర్శులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ జె.చెన్నయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న సాహితీమూర్తులను పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 23న పరిషత్ ఆడిటోరియంలో ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

గోల్కొండ కోటలో కార్డన్ సర్చ్



గోల్కొండ: పంద్రాగస్టు వేడుకల సందర్భంగా పోలీసులు సోమవారం సాయంత్రం గోల్కొండలో కార్డన్‌సర్చ్ నిర్వహించారు. కటోరాహౌజ్, రేషమ్ బాగ్, బంజారా దర్వాజ తదితర ప్రాంతాల్లో సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్‌కరే ఆధ్వర్యంలో ఈ కార్డన్‌సర్చ్ జరిగింది. డీసీపీ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను తనిఖీ చేశారు. బంజారా దర్వాజ నుంచి గోల్కొండ కోటకు వెళ్లే ఇరుపక్కల ఉన్న షాపులను కూడా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలు లేని పలు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

తిరుమలకు ఆలయ కమిటీ ప్రతినిధులు



చార్మినార్: పాతబస్తీకి చెందిన పలువురు మహంకాళి ఆలయాల కమిటీ ప్రతినిధులు తిరుపతికి వెళ్లి సోమవారం వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల ముగింపు, మారుబోనం అనంతరం ప్రతి ఏడాది తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లి ప్రత్యేక దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మీరాలంమండి మహాంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, బేలా మాతేశ్వరి ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పాటిల్ సదానంద్ యాదవ్, హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్, దినేష్ తదితరులు స్వామి దర్శనం చేసుకున్నారు.

మహిళ అదృశ్యం



సికందర్ జహాన్ (ఫైల్)

గౌలిపురా: మహిళ అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం.. మొఘల్‌పురా సుల్తాన్‌షాహీ ప్రాంతానికి చెందిన సికందర్ జహాన్ (52) ఈనెల 12న బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. భర్త మసూద్ ఆలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష

డబీర్‌పురా: వేర్వేరు కేసుల్లో ఇద్దరికి సోమవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్. లక్ష్మణ్‌రావు మూడు రోజు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం... మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంజేషా ప్రాంతంలో మహ్మద్ జావీద్ (38) పాన్ షాపును నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి దాటిన అనంతరం కూడా వ్యాపారం నిర్వహిస్తూ న్యూసెన్స్‌కు కారణమవుతున్నాడు. పోలీసుల జావీద్‌పై కేసు నమోదు చేసుకొని సోమవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు మూడు రోజు సాధారణ జైలు శిక్ష విధించాడు.

మరో కేసులో...

మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధి యాకుత్‌పురా ప్రాంతంలో మహ్మద్ హసి బుర్హాన్ ఈ నెల 1న తన ఇంటి డ్రైనేజీ మరమ్మతులకు సెప్టిక్ ట్యాంక్‌ను ఆర్డర్ చేయగా.. అది క్లీనింగ్ చేస్తున్న సమయంలో స్థానికంగా ఉండే మహ్మద్ ఓమేర్ ఇంకెంత సేపు బండి నిలుపుతావంటూ బుర్హాన్‌తో గొడవకు దిగి దాడికి పాల్పడ్డాడు. బుర్హాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని అరెస్ట్ చేసి సోమవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఎస్. లక్ష్మణ్‌రావు నిందితుడు ఓమేర్‌కు మూడు రోజు సాధారణ జైలు విధిస్తూ తీర్పునివ్వడంతో పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు స్నాచింగ్

దూద్‌బౌలి: మహిళ మెడలోని ఆరు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన ఆదివారం చార్మినార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిపురాకు చెందిన భూషణదేవి (58) ఆదివారం సాయంత్రం రికాబ్‌గంజ్ ప్రాంతంలో తమ కూతురుతో కలిసి షాపింగ్ చేయడానికి వచ్చింది. ఆనంద్ ఫ్యాన్సీ స్టోర్ పక్క సందులో ఓ గుర్తు తెలియని వాహనంపై వచ్చి భూషణదేవి మెడలో నుంచి ఆరు తులాల బంగారు గొలుసును లాక్కెల్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు

గౌలిపురా: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో దురుసుగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి సోమవారం నాంపల్లిలోని 12వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ రాజేందర్ ఒకరోజు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సరూర్‌నగర్‌కు చెందిన అబ్దుల్ సమీర్ అబ్రార్ (34) ఈ నెల 12న విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆటంకం కలిగించడంతో వారి దురుసుగా ప్రవర్తించాడు. పోలీసులు అబ్దుల్ సమీర్ అబ్రార్‌పై ఈ-పెట్టీ కేసు నమోదు చేశారు. నాంపల్లిలోని 12వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రాజేందర్ ఒకరోజు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.